# సన్మానాలు

ఈ రోజుల్లో సన్మానాలు పెరిగిపోయాయి - ఎవరు ఏం చేశారూ అన్నది ముఖ్యం కాదు. ఎవరు ఎన్ని సన్మానాలు చేయించుకున్నారు అన్నది ముఖ్యం - ఆ సన్మానాలమీద ఆధారపడే వ్యక్తి పరపతి కూడా పెరుగుతోంది. రోజూ ఒక సన్మానం, వార్తాపత్రికల్లో ఓ ఫోటో పడడం వ్యక్తికి మంచి ప్రచారం, అందరూ అతన్ని గొప్పగా ఊహించుకుంటారు. రాజకీయాలలో పదవి వస్తే సన్మానం. పదవి దిగిపోతే సన్మానం. ఉద్యోగం దొరకితే సన్మానం. ఉద్యోగం నుంచి రిటైరైతే సన్మానం. మంత్రిపదవి వస్తే సన్మానం. మంత్రి పదవి ఊడితే సన్మానం. ఇలా సన్మానరీతులు సాగిపోతాయి ముఖ్యమంత్రులైతే ప్రతీ పది రోజుల పాలనకు అభినందన సభలు జరిగితీరాలి. ఎందుకంటే ఎవరు ఎంతకాలం ఉంటారో! కవుల సంగతి చెప్పనే అక్కర్లేదు - ఓ కవితా గ్రంథం వెలువడినా సన్మానం. ఆ గ్రంథం రెండవ ముద్రణకు సన్మానం ఆ పుస్తక సమీక్ష నాడు కూడా సన్మానం - ఇటువంటి సన్మానాలు కథకులకూ, నవలా రచయితలకూ దొరకవు సాధారణంగా -

కథలు వ్రాయుటకన్న కవిత వ్రాయుట హాయి
బిరుదులు, శాల్వాలు తరుచువచ్చు

అని వోసారి నేను రాశాను. కథలు వ్రాసేవారు అది మాని కవితలు వ్రాస్తూ సన్మానాలకోసం అర్రులు చాచడం పరిపాటైపోయింది.

ఆటవెలది కలిగి తేటగీతిని వ్రాసి
కవిత మంటవేడి కాలెన తడు
చావకుండ మందు సన్మానమొక్కటే
పోతుకూచిమాట పొల్లు పోదు

ఈ ఆటవెలది పద్యం కూడా పోతుకూచీయంలో నాదే. అయితే ఈ రోజుల్లో సన్మానాలు ఊరికే జరగడంలేదు. వాటికి రేట్లు ఉన్నాయి. సాదా సన్మానికి కనీసం 500 రూపాయలు. మంత్రులు సభలో కావాలంటే 1000 రూ. పెద్ద రవీంద్రభారతిలో కావాలంటే మూడు వేల రూపాయలు - ఇలా సన్మానం కావాలన్న వాని తాహతుబట్టి రేట్లు మారతాయి - ఇలా డబ్బులిచ్చి సన్మానాలు చేయించుకునే కవులూ వున్నారు!

ఇంక రాజకీయవేత్తలు, సినీ ప్రముఖుల సంగతి చెప్పనక్కరలేదు - 1950 టు 1970 ప్రాంతంలో మేమూ ఎందరికో సన్మానాలు చేశాము. కానీ కష్టపడి విరాళాలు సేకరించి సన్మానాలు చేసేవారం. సన్మానితుడి దగ్గర డబ్బు వసూలు చేయాలనే ఆలోచనే వుండేది కాదు ఆ రోజుల్లో. రాజకీయాల్లో 'అవినీతి' 1960 తర్వాత బాగా పెచ్చు పెరిగిపోయింది - అలాగే కళారంగంలో కూడా ఒక పదవికి 'ఎర' వేయాలంటే ఓ పెద్ద సన్మానం చేయించుకోవాలి - ముఖ్యంగా ముఖ్యమంత్రి సమక్షంలో -

ఇప్పుడు కొత్తగా అవార్డుల సభలు పెరిగిపోయాయి. ఎవరో ఒకరి పేరుమీద అవార్డు ఇస్తారు. ఆ పేరుగల వారి కుటుంబం నుంచి డబ్బు వసూలుచేస్తారు. సగం ఖర్చు పెట్టినా సగం లాభం కార్యకర్తలకు - అందువల్ల సన్మానాలు వ్యాపారంలా మారిపోయాయి. ఈ రోజుల్లో వీధి వీధి ఎన్నో సంస్థలు -ఎందరో అధికారులు,అనధికారులు వారికి అండగా

వుంటారు. అండగావున్నవారికి దండలూ, ప్రచారం - అవార్డులు ఖర్చు ఇప్పించి వారు సాయం చేస్తే తద్వారా లాభం సంస్థల కార్యకర్తలకు కలుగుతుంది. పైగా పరపతి, పరిచయాలు ప్రచారం కూడా - ఇది ఈ రోజుల్లో ఓ లాభసాటి బేరం - సన్మానాలు చేసి కార్లు, మేడలు కొన్న వారు కూడా ఈ రోజుల్లో వున్నారంటే అతిశయోక్తి కాదు - ఈ అవార్డుల్లో విచిత్రం ఏమిటంటే మనిషంత ఎత్తు 'ఆహ్వానపత్రిక' ప్రచురించడం - దానికే పదివేలు ఖర్చుపెడతారు అంత 'పత్రం' లేకపోతే జనం సభకు రారా! ఈ ఖర్చు డబ్బంతా 'బ్లాక్ మనీ'. ప్రతి సంస్థ చిన్న సన్మానాన్ని కూడా 'అవార్డు' అంటున్నారు. వో దండ, వో శాలువా ఇచ్చేసి అవారు అని ప్రకటించడం కూడా విడ్డూరంగా వుంది.

ఈ సన్మానాలు సమాజంలో వో జబ్బు అయిపోయింది. ఈ జబ్బు పోతే కానీ నిఖార్సయిన ప్రముఖులు కనిపించరు!

-0-